సాక్షి మహబూబాబాద్

మంగళవారం | 30 | జూలై | 2024



'ఓపీఎస్'లను పట్టించుకోరా..!?

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఔట్ సోర్సి ంగ్ పంచాయతీ కార్యదర్శుల(ఓపీఎస్)కు భరోసా కరువైంది. అరకొర వేతనంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - 10లో▸



'మహాలక్ష్మి'తో పెరిగిన ఆదాయం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి మరింత ఆదాయం పెరిగిందని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను చెప్పారు. - 10లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి



గార్ల: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై బ్యాంకుల కంటే అధిక వడ్డీ చెల్లిస్తున్న తపాలాశాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సబ్ డివిజన్ పర్యవేక్షణ అధికారి కాళి మహేశ్వరి సూచించారు. సోమవారం గార్ల వర్తకసంఘం భవనంలో తపాలా సేవలపై ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న మొత్తాల పొదుపు పథకాలు, సేవింగ్ అకౌంట్స్, లైఫ్ ఇన్సూరెన్స్, యాక్సిడెంటల్ పాలసీలు తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని సూచించారు. మండల కేంద్రాలకు రాకుండా ప్రజలు గ్రామాల్లోని బ్రాంచీ పోస్టాఫీసుల్లో సైతం ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయవచ్చని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో గార్ల సబ్ పోస్ట్‌మాస్టర్ నాగరాజు, ఎంఏ మల్లికార్జున్ రావు, జమీలాబేగం తదితరులు పాల్గొన్నారు.

పూల దారి..



మరిపెడ రూరల్: మండలంలోని గుండెపుడి గ్రామ ప్రధాన రహదారిలో ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు విరబూశాయి. దీంతో ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నట్లుగా రోడ్డు వెంట పూలు కనువిందు చేస్తున్నాయి. ఈ దారిలో ప్రయాణించే పలు వాహనదారులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

కొనుగోలు కేంద్రానికి ఆయిల్‌పామ్ గెలలు



కురవి: ఆయిల్‌పామ్ గెలలు సేకరిస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి మరియన్న అన్నారు. మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి సోమవారం జిల్లా నలుమూలల నుంచి రైతులు పండించిన ఆయిల్‌పామ్ గెలలను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారుల బెడద లేకుండా ఆయిల్ పామ్ రైతుల నుంచి గెలలు నేరుగా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మార్కెట్, రవాణా సౌకర్యం ఉందన్నారు. జిల్లాలో 7,267 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు అవుతుందని వివరించారు. 2019, 2020 సంవత్సరంలో నాటిన 376 ఎకరాల ఆయిల్‌పామ్ తోటల్లో దిగుబడి మొదలైందని, ఎకరానికి రైతులు రూ.లక్ష ఆదాయం పొందుతున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పంట సాగు అవుతుందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు.

రుణమాఫీ కాలేదని రైతుల ఆందోళన



చిన్నగూడూరు: రైతు రుణమాఫీ కాలేదని కొంతమంది రైతులు మండలంలోని జయ్యారం ఇండియన్ బ్యాంక్ ఎదుట సోమవారం ఆందోళన చేశారు. తమకు రుణమాఫీ ఎందుకు కాలేదని వ్యవసాయ, బ్యాంక్ అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పకుండా బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని రైతులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు రుణమాఫీ వర్తింప చేయాలని రైతులు బొమ్మగాని ఉప్పలయ్య, బండి వెంకన్న, బత్తిని శ్రీనివాస్, నూనావత్ కీమా, గుగులోత్ రవి, లక్ష్మీనారాయణ, బాదావత్ రెడ్డి తదితరులు కోరారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

వాజేడు: తగ్గినట్టే తగ్గిన గోదావరి వరద సోమవారం మళ్లీ పెరిగింది. గోదావరి నీటిలో ముంపునకు గురైన రహదారులు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని ఇక రహదారి సౌకర్యానికి ఇబ్బందులు లేవు అనుకునే లోపే సోమవారం ఉదయం 10గంటల నుంచి క్రమేపీ వరద పెరిగింది. మళ్లీ రహదారులపైకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురిసిన వర్షాల కారణంగానే గోదావరిలోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో మళ్లీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

రియల్ మాఫియా!

అక్రమంగా వెంచర్లు ఏర్పాట్లు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

- తొర్రూరులో అడ్డగోలుగా ప్లాట్ల దందా
- లే అవుట్ అనుమతులు లేక మోసపోతున్న ప్రజలు
- సర్కారు ఖజానాకు గండి
- పట్టించుకోని అధికార యంత్రాంగం



తొర్రూరు మండలం వెలికట్ట శివారులోని అనధికార వెంచర్

తొర్రూరు: జిల్లా కేంద్రం మానుకోట తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న తొర్రూరు పట్టణంలో యథేచ్ఛగా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా కోట్లు సంపాదిస్తున్నారు. ఐదారు ఎకరాల స్థలం కొనుగోలు చేసి అందులో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండానే నేరుగా ప్లాట్లు చేస్తున్నారు. హద్దు రాళ్ల ఏర్పాటు చేసి విక్రయిస్తున్నా అడిగేవారే కరువయ్యారు. అక్రమ వెంచర్లపై మున్సిపాలిటీ, ఆయా పంచాయతీలకు ఫిర్యాదులు వస్తే తప్ప అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదులు అందితే వెంచర్లలోని హద్దు రాళ్లు తొలగించడం మినహా ఇతర చర్యలు లేకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

నిబంధనలు గాలికి..

ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. వెంచర్లు ఏర్పాటు చేసే స్థలంలో యజమానులు 30 ఫీట్ల వెడల్పు రోడ్డు నిర్మించాలి. రోడ్ల చివరలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలను సిమెంట్, కాంక్రీట్‌తో నిర్మించాలి. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, విద్యుత్ కనెక్షన్, తాగునీటి సౌకర్యం కల్పించాలి. ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకునే ప్రజలకు ఆహ్లాదం కోసం మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల నిబంధనల మేరకు పార్కులను ఏర్పాటు చేయాలి. అందులో సొంత ఖర్చులతో మొక్కలు నాటి అభివృద్ధి చేయాలి. దీనికోసం 10 శాతం స్థలం స్థానిక సంస్థలకు వెంచర్ యజమానులు అప్పగించాలి. సదరు స్థలాన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పేర రిజిస్ట్రేషన్ చేయించాలి. ఈ ఏర్పాట్లు అన్ని చేశాకే లేఅవుట్ అనుమతులకు దరఖాస్తు చేయాలి. లేఅవుట్ అనుమతులకు నిర్ణీత ఫీజును ప్రభుత్వానికి చెల్లించాలి. ప్రస్తుతం తొర్రూరులో ఏర్పాటు చేస్తున్న వెంచర్లలో ఎక్కడా కూడా పై నిబంధనలు అమలు కావడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

తొర్రూరులో దందా..

తొర్రూరు పట్టణం, మండల శివారులో ఎక్కడపడితే అక్కడ అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. పట్టణంలోని కంఠాయపాలెం రోడ్డులో ఒక వెంచర్‌కు, టీచర్స్ కాలనీలో మరో వెంచర్‌కు ప్రభుత్వ అనుమతి ఉంది. మండలంలోని నాంచారిమడూరు, మడిపల్లి గ్రామ శివారులోని రెండు వెంచర్లకు అనుమతి ఉంది. నాంచారి మడూరు శివారు, వెలికట్ట, ఫత్తేపురం శివారుల్లో పలు వెంచర్లకు ప్రభుత్వ అనుమతి లేదు. గతంలో అధికారులు హద్దు రాళ్లు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని టీచర్స్‌కాలనీ, సర్వీనగర్, కంఠాయపాలెం రోడ్డు, పాలకేంద్రంతో పాటు పలు కాలనీల్లో అక్రమ ప్లాట్ల దందా కొనసాగుతోంది. వ్యవసాయ భూముల్లోనే వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారు.



తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయంలో అనుమతి లేని వెంచర్ల వివరాలతో కూడిన ఫ్లెక్సీ

నాయకుల అండతో..

రాజకీయ నాయకులు అండ ఉంటే చాలు వ్యవసాయ భూములు నివేశన స్థలాలుగా మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది చేయి తడిపి రూ.లక్షల్లో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఒక్కో వెంచర్‌పై ఏకంగా ఐదారు రెట్లు లాభాలు గడిస్తూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. అధికారులు సందర్శించినప్పుడు మామూళ్లు ముట్టజెప్పుతూ పనులు చక్కబెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

మోసపోతున్న కొనుగోలుదారులు..

ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటవుతున్న వెంచర్ల కారణంగా ప్లాట్ల కొనుగోలుదారులు నిలువునా మునుగుతున్నారు. లేఅవుట్ లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నిబంధనల మేరకు రోడ్లు ఉండని కారణంగా సొంతంగా స్థలం వదిలివేయాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు వెంచర్లలోని రోడ్లు 30 ఫీట్ల వెడల్పు ఉండాలి. అంతకు తక్కువ వెడల్పు ఉన్న పక్షంలో నిర్ణీత వెడల్పునకు సరిపడా స్థలాన్ని ప్లాటులో నుంచి మున్సిపాలిటీ, పంచాయతీల పేరిట రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ఒక వేళ 30 ఫీట్ల వెడల్పు కలిగిన రోడ్లు ఉన్నప్పటికీ లేఅవుట్ అనుమతి లేకపోవడంతో ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు కావు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతుండటంతో బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం లేదు.

అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దు



లేఅవుట్ అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దు. మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేని వెంచర్లపై చర్యలు తీసుకుంటాం. నాలా కన్వర్షన్, జిల్లా ప్రణాళిక విభాగాల నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు పొందిన తర్వాతే ప్లాట్లు విక్రయించాలి. అన్ని రకాల అనుమతులు ఉన్నాయా లేదా అని నిర్ధారించుకుని కొనుగోలుదారులు కొనాలి.

– శాంతికుమార్, మున్సిపల్ కమిషనర్, తొర్రూరు

నెక్కొండ టు పారిస్

పారా ఒలింపిక్స్‌లో న్యాయనిర్ణేతగా వరంగల్ బిడ్డ

- నెక్కొండ వాసికి అరుదైన అవకాశం
- బ్యాడ్మింటన్ టెక్నికల్ అఫీషియల్‌గా పీడీ రాజేందర్





పీవీ సింధుతో రాజేందర్(ఫైల్)

వరంగల్ స్పోర్ట్స్/కేసముద్రం : అత్యంత ప్రతిష్టాత్మకంగా పారిస్‌లో జరగనున్న 33వ పారా ఒలింపిక్స్ క్రీడా సమరంలో న్యాయ నిర్ణేతగా వ్యవహరించే అరుదైన అవకాశం తెలంగాణ బిడ్డకు దక్కింది. షటిల్ బ్యాడ్మింటన్ టెక్నికల్ అఫీషియల్‌గా భారతదేశం నుంచి ఇద్దరికి అవకాశం రాగా.. అందులో వరంగల్ వ్యక్తి ఒకరు కావడం విశేషం. ఆగస్టులో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (మలేషియా) పారా ఒలింపిక్స్‌లో న్యాయ నిర్ణేతలుగా పాల్గొనేందుకు భారత్ నుంచి పుణెకు చెందిన ఒకరిని నియమించగా.. ఉమ్మడి వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ కొమ్ము రాజేందర్‌కు అవకాశం కల్పిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి దశ ఒలింపిక్స్ కొనసాగుతుండగానే.. రెండో దశలో ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు పారిస్ వేదికగా పారా ఒలింపిక్స్ ప్రారంభం కానున్నాయి. ఈ ఒలింపిక్స్‌లో కొమ్ము రాజేందర్ టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించనున్నారు. భారత్ నుంచి తనకు అందిన ఈఅవకాశాన్ని అరుదైన గౌరవంగా భావిస్తున్నానని చెబుతున్నారు ఫిజికల్ డైరెక్టర్ కొమ్ము రాజేందర్.

ప్రతిభ చాటుతూ..

- 2002లో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడిగా నర్సంపేటలో రాజేందర్ విధుల్లో చేరారు. చిన్నతనం నుంచి షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రత్యేక ప్రతిభ చాటుతూ.. రాష్ట్ర, జాతీయ, యూనివర్సిటీ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు.
- క్రీడాకారుడిగా, పీఈటీగా చక్కటి గుర్తింపు తెచ్చుకున్న రాజేందర్ 2007లో రాష్ట్ర స్థాయి, 2010లో నేషనల్ గ్రేడ్–2 అంపైర్‌కు రాసిన పరీక్షలో (హరియాణా) రెండో స్థానంలో నిలిచారు.
- 2013లో నేషనల్ గ్రేడ్–1 ఎగ్జామ్(భోపాల్)లో నాలుగో ర్యాంకు సాధించారు.
- రాజేందర్ ప్రతిభను గుర్తించిన బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ అంతర్జాతీయ టెక్నికల్ అఫీషియల్ గుర్తింపు కల్పించింది.
- రెండుసార్లు సీనియర్ వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అంపైర్‌గా, ఏషియన్ గేమ్స్‌లో అంపైర్‌గా పనిచేశారు.
- 2010లో వరంగల్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.
- 2020లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.
- 2018లో ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ అవార్డు అందుకున్నారు.

విద్యాభ్యాసం ఇలా..

వరంగల్ జిల్లా నెక్కొండ గ్రామానికి చెందిన కొమ్ము రాజేందర్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఇంటర్మీడియట్, డిగ్రీ వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో పూర్తి చేశారు. వైజాగ్ గీతం యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్, హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంపీఈడీ, తమిళనాడు అన్నామలై వర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేశారు. అంతటితో ఆగకుండా జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో వ్యాయామ విద్యలో పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం ఆయన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్ జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.



ఢిల్లీలో జరిగిన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ మ్యాచ్‌లో టాస్ వేస్తున్న రాజేందర్(ఫైల్)

గురువుల ప్రోత్సాహంతోనే..



పాఠశాల స్థాయిలో ఆటల్లో నా ప్రతిభను గుర్తించి నాటి నుంచి ఒలింపిక్స్‌లో టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపికవడం వరకు అడుగడుగునా గురువులు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. క్రీడా గురువులు రాజశేఖర్, చెన్న కృష్ణ, సాంబయ్య, నిమ్మ మోహన్‌రావు, పి.కుమారస్వామి ఆట నేర్పిస్తే, అంపైర్‌గా రాణించేలా షటిల్ బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.రమేశ్‌కుమార్, డాక్టర్ పి.రమేశ్‌రెడ్డి, రాష్ట్రస్థాయిలో కేసీహెచ్ పున్నయ్య చౌదరి, సుధాకర్ వేమూరి భుజం తట్టారు.

– కొమ్ము రాజేందర్, పారా ఒలింపిక్స్ టెక్నికల్ అఫీషియల్



కొమ్ము రాజేందర్‌ను అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి(ఫైల్)

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేసిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శాఖపరమైన అంశాలపై జిల్లా పరిధిలోని పోలీసు అధికారులతో మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ సమావేశ మందిరంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూఐ కేసులు, గ్రేవ్ యూఐ లాంగ్ పెండింగ్ కేసుల పరిష్కారం, ఎస్సీ, ఎస్టీ యూఐ కేసులు, పోక్సో కేసుల పరిష్కారం, గుడుంబా, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులు, సైబర్ క్రైమ్, షీ టీమ్స్ తదితర అంశాలపై సమీక్ష జరిపారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రో కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలని ఎస్పీ సూచించారు. భూ, సివిల్ కేసుల్లో ఎస్‌ఓపీ ప్రకారం పారదర్శకంగావిచారణ చేపట్టాలని, గంజాయి కట్టడికి పోలీస్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలని, పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి నేరస్తుడికి శిక్ష పడేలా కేసులను పక్కా ఆధారాలతో నమోదు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాల ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు.

జ్వరం బారిన 'కుమ్మరిబజార్'



జ్వరంతో బాధపడుతున్న తండ్రికొడుకులు

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామంలోని కుమ్మరి బజార్ వాసులు జ్వరాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా కుమ్మరి బజార్ వాసులు జ్వరం, ఒంటి నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆర్‌ఎంపీలు, ప్రైవేట్ వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. కుమ్మరి బజార్‌కు చెందిన డెంకెన నరేష్ మూడు రోజుల క్రితం జ్వరం బారిన పడగా అతడి రెండేళ్ల కుమారుడు వారం క్రితం జ్వరం బారిన పడి మహబూబాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం కోలుకుంటున్నాడు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

తొర్రూరు: మాలల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి అోద భాస్కర్ అన్నారు. డివిజన్ కేంద్రంలో సోమవారం మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమళ్ల మహేష్, టీజేఎంఏ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డు అశోక్‌తో కలిసి భాస్కర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధిని అడ్డుకుంటుందని, కులాల విచ్ఛిన్నానికి కుట్రలు చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి ఆగస్టు 7,8,9 తేదీల్లో ఢిల్లీలో సామాజిక చైతన్య దీక్షలు చేయనున్నామని తెలిపారు. ఆగస్టు 1న మహబూబాబాద్‌లో నిర్వహించే జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనపర్తి నగేష్, పట్టణ అధ్యక్షుడు గార అనిల్, నాయకులు యాకాంతం, ఎనమల రాకేష్, కారం ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

రుద్రేశ్వరుడికి కదంబపూలతో అర్చన

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో ఆషాఢ బహుళ నవమి శివప్రీతికరమైన సోమవారం స్వామివారికి కదంబ పూలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి సుప్రభాతసేవ, ఉత్థిష్ట గణపతికి అభిషేకం, పూజలు చేశారు. రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం, వంద మంది దంపతులు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించుకున్నారు. ఆలయ ఆవరణలోని కదంబ వృక్షం నుంచి సేకరించిన కదంబపూలతో పుష్పార్చన జరిపారు. ఈసందర్భంగా గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. వాసనలేని పుష్పాలే శివుడికి ప్రీతికరమైనవని, కదంబపూలతో అభిషేకం నిర్వహించడం వల్ల ఆది దేవుడి అనుగ్రహంతో వాతావరణ పరిస్థితుల్లో కలిగే మార్పుల వల్ల వచ్చే వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని పురాణాల్లో ఉందని పేర్కొన్నారు. సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దేవాలయాన్ని సందర్శించారు.

రైల్వే సీనియర్ డీఎంఈ వెంకటకుమార్‌కు స్వాగతం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఎంఈగా సోమవారం ఎస్‌వీ వెంకటకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎ.స్వరాజ్‌కుమార్ డిప్యూటీ సీఎస్‌ఓ/మెకానికల్ సికింద్రాబాద్ హెడ్‌క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో హైదరాబాద్ డివిజన్ సీనియర్ డీఎస్ఓగా పనిచేస్తున్న వెంకట కుమార్ వచ్చారు. ఆయనకు.. రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో స్వాగతం పలుకుతూ స్వరాజ్‌కుమార్‌కు వీడ్కోలు పలికారు. రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ సెక్రటరీ పాక వేదప్రకాశ్, చైర్మన్ ఎస్.కె.జానిమియా, సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, నాయకులు రాజేశ్వర్, యాదగిరి, శరన్‌గ్రేసి, విజయ ఉన్నారు.

పాత ప్రాతిపదికన 'సీతారామ' అమలు చేయాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

బయ్యారం: పాత ప్రాతిపదికన సీతారామ ఎత్తిపోతల పథకం అమలు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. సోమవారం స్థానిక కోదండరామయ్య ఫంక్షన్ హాల్‌లో గునిగంటి రాజన్న అధ్యక్షతన పార్టీ జిల్లాస్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి నదిపై సీతారామ ప్రాజెక్టును పాత నమూనా ప్రకారం నిర్మించి ఇల్లెందు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద 2016లో నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారని, అయితే నాటి నుంచి నేటి వరకు ఒక తట్ట మట్టి కూడా తీయలేదని తెలిపారు. డిజైన్ మార్చి ఇల్లెందు నియోజకవర్గానికి అన్యాయం చేస్తూ సత్తుపల్లి, వైరా, ప్రాంతాలకు లబ్ధి చేకూరేలా నిర్మాణం సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే పాత డిజైన్ ప్రకారం రోళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి ఇల్లెందు నియోజకవర్గానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆందోళన కార్యక్రమాలు చేస్తుందని హెచ్చరించారు. బయ్యారం పెద్ద చెరువును కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా చేసి కాలువల శాశ్వత మరమ్మతులు చేపట్టాలన్నారు. తెలంగాణ విభజన సందర్భంగా బయ్యారం ఉక్కు పరిశ్రమను, నేడు సీతారామ ప్రాజెక్టు డిజైన్‌ను మార్చి ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు సూర్నపు సోమయ్య, అలువాల వీరయ్య, ఆకుల రాజు, కందునూరి శ్రీనివాస్, మండా రాజన్న, నంబూరి మధు, వల్లాల వెంకన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేయూలో స్పోకెన్ ఇంగ్లిష్, స్కిల్స్‌పై శిక్షణ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో 40 రోజుల పాటు స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విశ్వవిద్యాలయ విద్యార్థులు, పరిశోధకులు, పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు, ఉద్యోగులు, గృహిణులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. యూనివర్సిటీ విద్యార్థులకు రూ.1,000, బయటివారికి రూ.1,500లు ఫీజు చెల్లించాలని సూచించారు. క్యాంపస్‌లోని కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో నాన్‌టీచింగ్ ఫండ్ కింద ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆగస్టు 1వ తేదీనుంచి యూనివర్సిటీలో రోజు సాయంత్రం 4గంటల నుంచి 6 గంటలవరకు శిక్షణ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

13నుంచి దూరవిద్య బీఎల్ఐఎస్సీ పరీక్షలు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య బీఎల్ఐఎస్సీ (ఎక్స్ అభ్యర్థులు) విద్యార్థుల పరీక్షల టైం టేబుల్‌ను సోమవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ విడుదల చేశారు. ఆగస్టు 13, 16, 19, 21, 27వ తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 2, 4వ తేదీల్లో ఆయా విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ఉంటాయని చెప్పారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని వారు తెలిపారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కాజీపేట అర్బన్: తపాలాశాఖ అందజేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ సబ్ డివిజన్ ఏఎస్పీ రమాదేవి కోరారు. కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసి డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆమె మాట్లాడారు. పోస్టాఫీసుల్లో సేవింగ్ అకౌంట్, ఇన్సూరెన్స్ పాలసీలతో కలిగే లాభాలతో పాటు, బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుకన్య సమృద్ధి యోజన పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో కాజీపేట పోస్టుమాస్టర్ మొగిలి, బీఏఎం వినీత, రామరాజు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

‘ఓపీఎస్’లను పట్టించుకోరా?



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న జేపీఎస్‌ల సంఘం రాష్ట్ర నాయకులు (ఫైల్)

వేతనాల్లో భారీ వ్యత్యాసం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం రూ.28,719 వేతనం అందిస్తుండగా ఔట్ సోర్సింగ్ వారికి కేవలం రూ.10,600 అందిస్తున్నారు. ఈ ఓపీఎస్‌ల జీతాలు కూడా జిల్లాకో తీరుగా ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో అత్యధికంగా రూ.15 వేలు చెల్లిస్తుండగా.. మరికొన్ని జిల్లాలో రూ.10,600, రూ.12,500 చొప్పున ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు చెల్లిస్తున్నాయి. అవి కూడా రెండు, మూడు నెలలకోసారి ఇస్తున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీపీల్లో ఔట్‌సోర్సింగ్ కార్యదర్శుల వెట్టిచాకిరీ..

- జేపీఎస్, పీఎస్‌లతో సమానంగా విధులు
- పనికి తగ్గ వేతనాలు కరువు
- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

నల్లబెల్లి: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ (ఓపీఎస్) పంచాయతీ కార్యదర్శులకు భరోసా కరువైంది. 2017 సంవత్సరంలో ప్రభుత్వం విడుదల చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి భర్తీ నోటిఫికేషన్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు పరీక్ష రాసి మెరిట్, రోస్టర్ పాయింట్ల ద్వారా ఎంపికై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో జేపీఎస్‌లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి రూ.10,600 నుంచి రూ.15 వేల వరకు వేతనం మాత్రమే అందిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర వేతనం మూడు నెలలకోసారి ఇస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 125 మంది ఓపీఎస్‌లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖాళీగా ఉన్న పంచాయతీ సెక్రటరీ పోస్టులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రభుత్వం భర్తీ చేసింది. అయితే ఉద్యోగంలో పని ఒత్తిడి, ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక కొందరు, వేరే ఉద్యోగాలు రావడంతో మరికొందరు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఇలా వెళ్లిపోయిన వారిస్థానంలో పరీక్ష రాసిన వారిలో మెరిట్, రోస్టర్ పాయింట్ల ద్వారా ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులుగా నియమించారు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్యదర్శులను ప్రభుత్వం ఇటీవల కొందరిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా కన్వర్షన్ చేయడం జరిగింది. ఇంకా వరంగల్ జిల్లాలో 6, హనుమకొండ జిల్లాలో 4, మహబూబాబాద్ జిల్లాలో 12, జనగామ జిల్లాలో 48, భూపాలపల్లి జిల్లాలో 30, ములుగు జిల్లాలో 25 మందిని ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా కన్వర్షన్ చేస్తూ రెగ్యులరైజ్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల్లో నోటిపై చేయబడి క్లియర్ వేకెన్సీగా చూపిస్తున్నటు వంటి స్థానాల్లో రెండేళ్ల సర్వీస్ పూర్తిచేసిన ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా కన్వర్షన్ చేస్తూ రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

జిల్లాల వారీగా ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు

వరంగల్	6
హనుమకొండ	4
మహబూబాబాద్	12
జనగామ	48
భూపాలపల్లి	30
ములుగు	25
మొత్తం	125



జేపీఎస్‌లుగా క్రమబద్ధీకరించాలి



రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో జేపీఎస్‌లతో సమానంగా పని చేస్తున్నాం. పైగా ఉద్యోగ భద్రత లేక అభద్రత భావంతో విధులు నిర్వహిస్తున్నాం. ఈ మేరకు ఇప్పటికే పలుమార్లు సీఎం, మంత్రులతో పాటు అధికారులను కలిసి వినతి పత్రాలను అందించాం. ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరిస్తూ రెగ్యులరైజ్ చేయాలి.

- సాదం రమేశ్,
జేపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు, వరంగల్

ఎస్‌జీటీలకు పదోన్నతులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 256 మంది టీచర్లకు ఉత్తర్వులు జారీచేసిన డీఈఓలు
- రిలీవ్ అయి జాయిన్ అవుతున్న ఉపాధ్యాయులు



విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో 256 మంది సెకండ్‌గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ)కు పీఎస్ హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించారు. ఆదివారం అర్ధరాత్రి వివిధ జిల్లాలకు పదోన్నతుల ఉత్తర్వుల జాబితాలు ఆయా జిల్లాల డీఈఓలకు రాగా పదోన్నతులు పొందిన ఎస్‌జీటీలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల టీచర్లకు పదోన్నతులు కల్పించగా కొందరు రెండు పోస్టుల్లో పదోన్నతులు పొందగా వారు ఒక పోస్టులో జాయిన్ అయిన విషయం విధితమే. ఆ విధంగా మిలిగిన పోస్టుల్లో ఆయా ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించారు. శనివారం రాత్రి నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు. ఆదివారం మధ్యాహ్నం వరకు వెబ్ ఆప్షన్లు ఉపాధ్యాయులు ఇచ్చుకున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వెబ్‌ఆప్షన్ల ఎడిట్ చేసుకునే అవకాశం కూడా కల్పించారు. అర్ధరాత్రి వరకు పదోన్నతుల ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతులు పొందిన ఎస్‌జీటీలు సోమవారం తాము పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవ్ అయి పదోన్నతుల ద్వారా కేటాయించిన స్కూళ్లలో జాయిన్ అవుతున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో 256 మందికి..

మల్టిజోన్ -1 పరిధిలో హనుమకొండ జిల్లాలో 43 మంది ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించారు. అందులో పీఎస్‌హెచ్‌ఎం 11, ఎస్ఏ సోషల్ 16, ఎస్ఏ బయాలజికల్ సైన్స్ 8, ఇంగ్లిష్ 7, ఫిజికల్ సైన్స్ 1 టీచర్లకు పదోన్నతులు ఉత్తర్వులను డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై జారీ చేశారు. వరంగల్ జిల్లాలో 44, ములుగు జిల్లాలో 33, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 34, మహబూబాబాద్ జిల్లాలో 59 మంది ఎస్‌జీటీలకు పీఎస్ హెచ్‌ఎంలను స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ ఆయా జిల్లాల డీఈఓలు పదోన్నతుల ఉత్తర్వులు ఆయా టీచర్లకు జారీ చేశారు. మల్టిజోన్-2 పరిధిలోని జనగామ జిల్లాలో 43 మంది ఎస్‌జీటీలు పీఎస్ హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

భూపాలపల్లి అర్బన్ : ఎండు గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్లో గంజాయి విక్రయిస్తున్నారని ఎస్సై సుధాకర్‌కు పక్కా సమాచారం అందింది. కాగా తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా దాదాపు 3కేజీల ఎండు గంజాయి తీసుకు వెళ్తున్న ముగ్గురు కనిపించినట్లు తెలిపారు. మండలంలోని కాశింపల్లికి చెందిన దేవర కిషోర్, మోకిడి అజయ్, హుజురాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన రెడ్డిబోయిన అరవింద్ పట్టుబడగా వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

‘మహాలక్ష్మి’తో పెరిగిన ఆదాయం

- ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభాను
- వరంగల్ రీజియన్‌కు రూ.41.49 కోట్ల లాభం
- 105 కొత్త బస్సులు.. మరో 40 బస్సుల రాక



సమావేశంలో మాట్లాడుతున్న విజయభాను

హన్మకొండ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహాలక్ష్మి పథకంతో టీజీఎస్ ఆర్టీసీకి మరింత ఆదాయం పెరిగిందని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను చెప్పారు. సోమవారం హనుమకొండలోని వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయభాను మాట్లాడారు. మహాలక్ష్మి పథకానికి ముందు 2022–23 ఆర్థిక సంవత్సరంలో వరంగల్ రీజియన్ రూ.55 కోట్ల నష్టంలో ఉండగా మహాలక్ష్మి పథకం తర్వాత 2023–24 సంవత్సంలో రూ.41.49 కోట్లు, 2024, ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ.35 కోట్ల లాభాల్లోకి వచ్చిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రభుత్వం 2023, డిసెంబర్ 12 నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. దీంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. వరంగల్ రీజియన్ ఆక్యుపెన్సీ రేషియో 60 శాతం నుంచి 92 శాతానికి పెరిగిందన్నారు. వరంగల్ రీజియన్‌లో 9 డిపోల ద్వారా 357 రూట్లలో 928 బస్సులు నడుపుతున్నామన్నారు. 928 బస్సుల్లో 759 బస్సులకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందన్నారు. మహాలక్ష్మి ప్రారంభం నుంచి వరంగల్ రీజియన్‌లో 9.46 కోట్ల మంది ప్రయాణించగా వీరిలో 5.78 కోట్ల (61 శాతం) మంది మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. దీంతో వరంగల్ రీజియన్‌కు రూ.554.63 కోట్ల ఆదాయం రాగా, ఉచిత ప్రయాణం ద్వారా రూ.293.53 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు. నూతనంగా 20 రూట్లలో బస్సులు నడుపుతున్నామని, ఈ పథకం అమలు తర్వాత రీజియన్‌కు 105 కొత్త బస్సులు వచ్చాయన్నారు. ఇందులో లహరి నాన్ ఏసీ-4, లహరి ఏసీ-4, రాజధాని-9, డీలక్స్-10, ఎక్స్‌ప్రెస్-69, పల్లె వెలుగు-9 బస్సులు వచ్చాయని వెల్లడించారు. ఈ 105 బస్సుల్లో 78 బస్సులు ఉచిత ప్రయాణానికి వినియోగిస్తున్నామన్నారు. మరో 42 కొత్త బస్సులు రానున్నాయని వివరించారు. రీజియన్‌లో మొదటిసారి బెంగళూర్, విశాఖపట్నానికి స్లీపర్ సీట్ కలిగిన లహరి బస్సులు ఫిబ్రవరి నుంచి నడుపుతున్నామన్నారు. ఉచిత ప్రయాణంతో హనుమకొండ డిపోలో ఆక్యుపెన్సీ రేషియో 85 శాతం, జనగామ-102, వరంగల్-1లో 82, వరంగల్-2లో 89, మహబూబాబాద్-102, నర్సంపేట-96, పరకాల-97, తొర్రూరు-102, భూపాలపల్లి డిపోలో ఆక్యుపెన్సీ రేషియో 101 ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఆర్‌ఎంలు కేశరాజు భానుకిరణ్, మాధవరావు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- రెండు కార్లు స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : వాహనాల ట్రాన్స్‌పోర్ట్ పేరుతో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన కృష్ణకాంత్ సక్సేనా, రాజస్తాన్ రాష్ట్రంలోని పాలీ ప్రాంతానికి చెందిన అనిల్ సోమ, వికాస్ వివిధ ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌పోర్ట్, పార్సిల్ సర్వీస్‌ల వద్ద కస్టమర్ వెహికల్ ట్రాన్స్‌పోర్ట్ చేసేందుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కాగా దూర ప్రాంతాలకు కారును ట్రాన్స్‌పోర్ట్ చేసేందుకు వారికి వాహనం ఇస్తే, తెలివిగా అదే వాహనం నెంబర్ ప్లేట్ మార్చి ఎవరికి అనుమానం రాకుండా ముగ్గురు కలిసి వరంగల్, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల్లో అదే వాహనంలో తిరుగుతూ దొంగతనాలు చేసే వారు. ఈక్రమంలో జూన్ 6వ తేదీన మహారాష్ట్రలోని గోండియా జిల్లాకు చెందిన వికాస్ తన కారును జైపూర్‌లోని రిలీఫ్ రీలొకేషన్ పార్సిల్ సర్వీస్ వారి నుంచి డెలివరీ కోసం తీసుకొని అదే వాహనంలో వరంగల్ చేరుకున్నాడు. జూన్ 24న హంటర్‌రోడ్డులోని ఓస్వాల్ ఎలక్ట్రికల్ షాప్ నుంచి సుమారు రూ.2 లక్షల విలువైన ఫినోలెక్స్ వైరును దొంగలించాడు. అయితే షాపు యజమాని ఫిర్యాదతో కేసు నమోదు చేసిన మట్టెవాడ పోలీసులు సీసీ కెమెరాలు, టెక్నికల్ సాయంతో ఏ-1 నిందితుడైన ఆగ్రాకు చెందిన కృష్ణకాంత్ సక్సేనాను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బంది అలీ, విజయ్, రాజు, తిరుపతి, నాగేశ్వర్‌రావు, ఐటీ కోర్ టీం సల్మాన్‌ను ఏసీపీ నందిరాం నాయక్ అభినందించారు.

జాగ్రత్తలు పాటిస్తే.. వాహనాలు సేఫ్

- వానాకాలం..బైక్‌లు భద్రం..!
- నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు



ఖిలా వరంగల్: వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ ద్విచక్రవాహనాలను భద్రంగా చూసుకోవాలి. వాహనాలు మరమ్మతులకు గురైతే కనీసం రూ.2 వేలు చేతిలో ఉండాల్సిందే. ఇంజన్ పాడైతే రూ.6 వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చవుతోంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అదనపు భారం పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కనీస జాగ్రత్తలు పాటిస్తే వాహనాలు మన్నికగా ఉంటాయని సీనియర్ మెకానిక్‌లు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3.50 లక్షల బైక్‌లు

వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3.50 లక్షల పైగా ద్విచక్రవాహనాలు ఉన్నాయి. ఏటా సుమారు రూ.20 వేలకు పైగా కొత్త వాహనాలు రహదారుల పైకి వస్తున్నాయి. ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసినా చాలా మంది వాటి నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఇంధనం ఖర్చు అధికమవుతుంది. వర్షాకాలంలో ద్విచక్రవాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతూ ఉంటాయి. వర్షంలో వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఆపేస్తుంటారు. వాహనాన్ని రహదారులపై మోకాలిలోతు నీళ్ల నిలిచిన ప్రాంతంలో నడుపుకుంటూ వెళ్తుంటారు. ఫలితంగా పలు భాగాల్లోకి నీరు చేరి మొరాయిస్తుంది. లాక్ సిస్టమ్, ప్లగ్ కేబుళ్లు, బ్రేకులు, ఇంజన్, ఫైరింగ్ సిస్టమ్, ఇలా వాహనంలో ప్రతి వస్తువు పాడయ్యే ప్రమాదం ఉంది. సైలెన్సర్‌లోకి నీళ్ల వెళ్తే ఇంజన్ మొత్తం పాడవుతుంది.

బ్రేకులపై ప్రభావం..

- వాహనం నీళ్లలో నానితే బ్రేక్ సిస్టమ్‌పై ప్రభావం చూపుతుంది.
- ప్రతి వాహనదారుడు తమ వాహనానికి సంబంధించి ముందు, వెనకటైర్లు, బ్రేకులు బాగున్నాయా..? లేవా..? అని సరిగా పనిచేస్తున్నాయా.. తనిఖీ చేయాలి.
- చైన్‌ను కూడా లూబ్రికేషన్ చేయించాలి. తడిస్తే తుప్పు పడుతుంది. ఈ నేపథ్యంలో చైన్ లూబ్రికేంట్‌ను వాడటం మంచిది.
- బ్యాటరీ పూర్తిగా చార్జింగ్ చేసి మంచి స్థితిలో ఉందో లేదో చూసుకోవాలి. వర్షానికి వాహనం తడిస్తే ఆ ప్రభావం పలు భాగాలపై పడుతుంది. విజిబిలిటి బాగుండాలంటే బ్యాటరీ ఫుల్‌గా ఉండాలి. బల్బుపోతే వెంటనే మార్చుకోవాలి.

వర్షాకాలంలో పాటించాల్సిన సూచనలు..

- ✔ నీటిలో వాహనాన్ని నడపొద్దు.. రోడ్లపై పెద్ద ఎత్తున నీరు నిలిచి ఉంటుంది. ఆయా మార్గాల్లో వెళ్లకపోవడమే శ్రేయస్కరం.
- ✔ నీటిలో గుంతలు కనిపించకుండా వెళ్తే అందులో పడిపోయే ప్రమాదముంది. దీంతో పాటు వాహనం ఎగ్జాస్టర్‌లోకి నీరు చేరే ఆస్కారముంది. ఫలితంగా వాహనం ఆగిపోవడమే కాకుండా ఇంజన్ కూడా రిపేర్‌కు వస్తుంది.
- ✔ నిర్లక్ష్యం చేస్తే డబ్బులు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తుంది.
- ✔ వర్షానికి వాహనం వానలో తడుస్తున్నా చాలా మంది ద్విచక్రవాహనదారులు పెద్దగా పట్టించుకోరు. బయట తిరిగి ఇంటికి వచ్చాక వర్షంలోనే వాహనం పెడతారు. ఇలా ఎప్పుడూ చేయకూడదు. తప్పనిసరిగా వాహనంపై కవర్ కప్పాలి. వర్షంపడని ప్రాంతంలో పార్కింగ్ చేస్తే భద్రంగా ఉంటుంది.

బైక్‌పై ప్రయాణం జాగ్రత్త



వర్షం పడుతుంటే బైక్‌పై ప్రయాణం చేయడం ప్రమాదకరం. టైర్లను మార్చాలి. టైర్లకు గ్రిప్ ఉండాలి. ఎప్పటికప్పుడు టైర్లను పరిశీలించాలి. అరిగిపోయి ఉంటే వాటిని మార్చుకోవాలి. లోతట్టు ప్రాంతాల్లో బైక్‌పై ప్రయాణిస్తే సైలెన్సర్ ద్వారా ఇంజన్‌లోనికి నీరు చేరుతుంది. జాగ్రత్తగా ప్రయాణం చేయడమే మేలు.

- ఎండి.జాఫర్, సీనియర్ బైక్ మెకానిక్

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

వరంగల్ : బీఎస్ఎన్ఎల్ అందజేస్తున్న సేవలను వినియోగదారులకు తెలిపేందుకు ఉద్యోగులు మోటార్ సైకిల్‌పై సోమవారం ర్యాలీ నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ పీజీఎం కార్యాలయం నుంచి పోచమ్మమైదాన్‌లోని కాకతీయ టెలిఫోన్ భవన్ మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పీజీఎం ఎం.చంద్రమౌళి మాట్లాడుతూ ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవల పట్ల వినియోగదారులు ఆకర్షితులు అవుతురని తెలిపారు. ఇతర మొబైల్ నెట్‌వర్క్‌లు అందిస్తున్న సేవలను తక్కువ ధరలకే వినియోగదారులకు బీఎస్ఎన్ఎల్ అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం విజయభాస్కర్ రెడ్డి, ఏజీఎం శేషు శ్రీనివాస్ బాలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



భాస్కర్ మృతదేహం

నర్మెట : విద్యుదాఘాతంతో ప్రమాదవశాత్తు ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని తెట్టెకుంట తండాలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం.. తెట్టెకుంట తండాకు చెందిన భూక్య భాస్కర్ (34) వ్యవసాయ పొలంలో గడ్డి మందును పిచికారీ చేస్తున్నాడు. ఈ క్రమంలో మోటార్ కు వెళ్లే సర్వీస్ వైరు పొలంలో కిందికి వేలాడుతూ ఉంది. కాగా గడ్డి మందు పిచికారీ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు భాస్కర్ మెడకు చుట్టుకుంది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటన స్థలానికి ఎస్సై నాగేష్ చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం యువకుడి దుర్మరణం

- చికిత్స పొందుతూ మృతి
- రేపు లేదా ఎల్లుండి మృతదేహం ఇండియాకు రాక



రోహిత్‌రెడ్డి (ఫైల్)

కురవి : అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామానికి చెందిన బండి రోహిత్‌రెడ్డి (27) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గుండ్రాతిమడుగు(విలేజి)కి చెందిన బండి అనిల్‌రెడ్డి-అనితారెడ్డి దంపతుల పెద్ద కుమారుడు రోహిత్‌రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 14న టెక్సాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో రోహిత్‌రెడ్డి చికిత్స పొందుతూ ఈనెల 24న మృతి చెందాడు. రోహిత్‌రెడ్డి తల్లిదండ్రులు అనిల్‌రెడ్డి, అనితారెడ్డితోపాటు చిన్న కుమారుడు అమెరికా నుంచి సోమవారం ఇండియాకు చేరుకున్నారు. కుమారుడి మృతదేహం ఈనెల 31లేదా ఆగస్టు 1వ తేదీన ఇండియాకు వస్తుందని కుటుంబీకులు తెలియజేశారు. గుండ్రాతిమడుగులో రోహిత్‌రెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని వివరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.8లక్షల వరకు ఆస్తి నష్టం



దగ్ధమవుతున్న ఇల్లు

మహాముత్తారం : ఇంట్లో పెళ్లి సందడి ప్రారంభం అవుతున్న వేళ పెళ్లి వస్తువులు కొనుగోలు చేసేందుకు వెళ్లి వచ్చేసరికి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి రూ.8లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడి కథనం ప్రకారం.. మహాముత్తారం మండలంలోని బొర్లగూడెం గ్రామానికి చెందిన వడ్రంగి కొండపర్తి బత్కయ్య తనకూతురు పెళ్లి సామగ్రి కొనేందుకు వెళ్లారు. కాగా ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో భారీగా మంటలు చెలరేగాయి. ఆ క్రమంలో బాధితులు ఇంట్లో ఎవరులేరు. మంటలు చెలరేగే సమయంలో ఇంటిపక్క వారు గమనించి ఇరుగుపొరుగు వారికి సమాచారం అందించారు. అర్ధరాత్రి కావడంతో అంతా నిద్రలో ఉన్నారు. దీంతో ఎవరు స్పందించకపోవడంతో ఇంట్లో ఉన్న సామగ్రి, నాలుగు కర్ర మిషన్లతోపాటు, టూవీలర్, ఇళ్లు పూర్తిగా కాలిపోయింది. తమ ఇంట్లో శుభకార్యం చేద్దామనే క్రమంలో ఇలాంటి సంఘటన జరగడం బాధిత కుటుంబాన్ని కలిచివేసింది.

ప్రాణహితకు మళ్లీ ప్రవాహం



కాళేశ్వరం వద్ద పెరుగుతున్న వరద ఉధృతి

కాళేశ్వరం : మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద ప్రాణహిత నదికి మళ్లీ వరద ప్రవాహం పెరుగుతోంది. సోమవారం సాయంత్రం కాళేశ్వరం వద్ద 10.090 మీటర్ల ఎత్తులో నీరు ప్రవహిస్తుంది. దిగువన ఉన్న మేడిగడ్డ(లక్ష్మి)బరాజ్ వద్ద 5,79,860 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వరద వస్తోంది. మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా, అన్నారం బరాజ్ వద్ద 7,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వరద వస్తోంది. బరాజ్‌లోని 66 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి తగ్గిన వరద ప్రవాహం సోమవారం సాయంత్రానికి మళ్లీ 2 మీటర్ల ఎత్తుకు నీటిమట్టం పెరిగింది. తెలంగాణలో వర్షాలు కాస్త గెరువిచ్చిన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.